సాక్షి మంచిర్యాల

సోమవారం, 25, నవంబర్, 2024

కవ్వాల్‌లో కలెక్టర్ పర్యటన



జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ జన్నారం అటవీ డివిజన్‌లో కలెక్టర్ కుమార్ దీపక్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సాయంత్రం పర్యటించారు. గేట్ నంబర్ 1 నుంచి గొండుగూడ బేస్‌క్యాంపు, బైసన్‌కుంట వరకు సఫారీ వాహనంలో ప్రయాణిస్తూ అడవి అందాలను వీక్షించారు. ఏకో టూరిజం, అడవి అభివృద్ధి పనులు పరిశీలించి అటవీ సిబ్బందిని అభినందించారు. డివిజన్ చేపడుతున్న అభివృద్ధి పనులు, రక్షణ, గడ్డి మైదానాల పెంపకం, నీటి కుంటల వివరాలను రేంజ్ అధికారి సుష్మారావు కలెక్టర్‌కు వివరించారు.

న్యూస్‌రీల్

సర్వే వివరాల నమోదు చాలా కీలకం

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ, కుల సర్వే ప్రక్రియలో ఎన్యుమరేటర్ల ద్వారా సేకరించిన సమాచారాన్ని తప్పులు లేకుండా పోర్టల్‌లో నమోదు చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కలెక్టర్లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో ఎన్యుమరేటర్ల ద్వారా సేకరించిన సమాచారాన్ని డాటా ఎంట్రీ ఆపరేటర్ల ద్వారా సంబంధిత పోర్టల్‌లో పొరపాట్లు లేకుండా నమోదు చేసేలా చర్యలు తీసుకోవా లన్నారు. సర్వే ప్రక్రియలో నిర్దిష్ట నమూనాలో సేకరించిన ప్రతీ అంశాన్ని స్పష్టంగా నమోదు చేయలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు మొదలైన వారి వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమవసతి గృహాలు రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్‌మోతిలాల్, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ రాష్ట్ర కమిటీలో నలుగురికి చోటు

మంచిర్యాలఅర్బన్: ఇటీవల ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) మహాసభల్లో మంచిర్యాల జిల్లాకు చెందిన నలుగురికి చోటు దక్కింది. రాష్ట్ర సహ అధ్యక్షుడిగా సిరంగి పవన్‌కుమార, సంయుక్త కార్యదర్శులుగా గాజుల తిరుపతి, చకినారపు సతీశ్‌కుమార్, కార్యదర్శిగా అరుణకుమార్ ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తి సత్తయ్య, బన్న రవీందర్ తెలిపారు.

జాతీయ పోటీలకు ఎంపిక



కోచ్‌తో శ్రీనాథ్

మంచిర్యాలఅర్బన్: పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో రెండురోజులు హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో మంచిర్యాలకు చెందిన విద్యార్థి శ్రీనాథ్ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శ్రీనాథ్ అండర్-14(28-30 కేజీలు) విభాగంలో రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. శ్రీనాథ్‌ను డీవైఎస్‌వో కీర్తి రాజవీర్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ ఫణిరాజ్, బాక్సింగ్ కోచ్ రాజేశ్ అభినందించారు.

అస్వస్థతతో 30 గొర్రెలు మృతి



నంనూర్‌లో మృతి చెందిన గొర్రెలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్):మండలంలోని నంనూర్ గ్రామానికి చెందిన 30 గొర్రెలు ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా మృతి చెందాయి. మరో 30 గొర్రెల పరిస్థితి విషమంగా ఉంది. గ్రామానికి చెందిన గోపు మల్లేశ్, గోపు కొమరయ్య, గోపు రాజ్‌కుమార్‌కు చెందిన గొర్రెలను ఆదివారం పాత నంనూర్ శివారులోని పంట పొలాల వైపు మేతకు తీసుకెళ్లారు. సాయంత్రం ఇంటికి తోలుకొచ్చారు. కాసేపటికి అస్వస్థతకు గురయ్యాయి. వరుసగా 30 గొర్రెలు మృతిచెందగా, మరో 30 గొర్రెల పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. పశు సంవర్ధక శాఖ అధికారులకు సమాచారం అందించారు. గొర్రెలు మృతికి కారణాలు తెలియలేదు.

సరితూగని సన్నాలు

సన్న రకం ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు సన్న రకం వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఈ వానాకాలంలో జిల్లాలో రైతులు అధికంగా సన్న రకం వడ్లు సాగుచేశారు. ప్రస్తుతం పంటలు కోతకు వచ్చాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తోంది. అయితే సన్నాలకు సంబంధించి ప్రభుత్వం విధించిన నిబంధనలకు జిల్లాలోని సన్న వడ్లు సరితూగడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- రూ.500 ఆశతో జిల్లాలో అధికంగా సన్న వడ్ల సాగు
- కొనుగోలు కేంద్రాలకు వస్తున్న దిగుబడి..
- ప్రత్యేక యంత్రంతో పరీక్షిస్తున్న నిర్వాహకులు
- నిబంధనల మేరకు లేవని చాలా వరకు తిరస్కరణ



గుడిపేట కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఈ వానాకాలం 1.60 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో 80 శాతం సన్నరకం వడ్లే వేశారు. సన్నరకం అన్ని వడ్లకు మద్దతు ధరతోపాటు బోనస్ క్వింటాల్‌కు రూ.500 వస్తుందన్న ఆశతో రైతులు సన్నాల సాగుకే మొగ్గు చూపారు. అయితే ప్రభుత్వం నిబంధనలతో కొన్నింటికే బోనస్ లభిస్తోంది. బోనస్ గ్రెస్ క్యాలీబర్ అనే పరికరంతో ధాన్యం పొడవు, వెడల్పు కొలుస్తున్నారు. ఆ పరికరంలో నిబంధనలకు అన్ని రకాల సన్న వడ్లు సరితూగడం లేదు. దీంతో సన్న వడ్ల కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆ వడ్లను మళ్లీ దొడ్డు వడ్ల కొనుగోలు కేంద్రానికి తరలించడం.. లేదా, ప్రైవేటుగా అమ్ముకోవాల్సి వస్తోంది.

80 శాతం సన్నాలు..

జిల్లాలో 1.60 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 3.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో ప్రధానంగా సన్నరకం జైశ్రీరాం, అంకూర్ సోనా, కావేరి, చింటు తదితర రకాలు ఎక్కువగా సాగు చేశారు. ఇందులో చాలా వరకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రావడం లేదు. దీంతో సన్న వడ్లను కూడా రిజెక్ట్ చేస్తున్నారు. దీంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు.

జిల్లాలో 303 కొనుగోలు కేంద్రాలు..

జిల్లాలో గత నెల 17 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నారు. 3.26 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా అధికారులు నిర్ణయించారు. ఇప్పటి వరకు 303 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 1,694 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించారు. దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సీజన్ నుంచి సన్న రకం, దొడ్డు రకం ధాన్యం సేకరణ వేరువేరుగా చేపడుతున్నారు. సన్న రకం వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేయాలంటే క్యాలీబర్ అనే మిషన్ ద్వారా నిర్ధారించాల్సి ఉంటుంది. ధాన్యం గింజ పొడవు 6 ఎంఎం, కంటే తక్కువగా.. గింజ వెడల్పు 2 ఎంఎం కంటే తక్కువగా ఉండాలి. ఈ పొడవు వెడల్పుల నిష్పత్తి మొత్తం కలిపితే 2.5 ఎంఎం కంటే ఎక్కువగా ఉండాలి. దీంతోపాటు తేమ 17 శాతంలోపే ఉండాలి. అప్పుడే దానిని సన్నరకంగా పరిగణిస్తున్నారు.

33 రకాల సన్నాల జాబితా..

సన్న వడ్లుగా ప్రభుత్వం 33 రకాలను గుర్తించింది. సాగుచేసిన వడ్లు ఇందులో ఉన్నా.. నిబంధనల మేరకు గింజ పొడవు, వెడల్పు ఉండకపోవడంతో తిరస్కరిస్తున్నారు. ప్రభుత్వం సన్నాలుగా ప్రకటించిన వాటిలో సిద్ధి, కంపసాగర్ వరి-1, సాంబమసూరి, వరంగల్ సాంబ, వరంగల్ సన్నాలు, జగిత్యాల మసూరి, పొలాస ప్రభ, కృష్ణ, మానేరు సోనా, తెలంగాణ సోనా, వరంగల్ వరి-1119, కునారి వరి-2, వరంగల్ వరి -2, రాజేంద్రనగర్ వరి-4, కునారం వరి-1, జగిత్యాల సన్నాలు, జగిత్యాల సాంబ, కరీంనగర్ సాంబ, అంజన, నెల్లూరు మసూరి, ప్రత్యుమ్న, సుగంధ సాంబ, శోభిని, సోమ్నాత్, ఆర్ఎన్ఆర్ 31424, హెచ్ఎంటీ సోనా, మారుటేరు సాంబ, మారుటేరు మసూరి, ఎంటీయూ 1271 రకాలు మాత్రమే ఉన్నాయి. వీటిలో జిల్లాలో సాగు చేసింది చాలా తక్కువ.



ధాన్యం సైజును పరిశీలించే గ్రెస్ క్యాలీబర్ మిషన్

జిల్లాలో కొనుగోలు కేంద్రాలు

	కేటాయించిన కేంద్రాలు	ప్రారంభించినవి	సేకరిస్తున్న కేంద్రాలు
ఐకేపీ	136	148	20
పీఏసీఎస్	120	89	00
డీసీఎంఎస్	60	60	01
మొత్తం	326	303	23
ఇప్పటి వరకు సేకరించిన దొడ్డు రకం ధాన్యం		1,615.040 మెట్రిక్ టన్నులు	
సన్నరకం ధాన్యం	79,400 క్వింటాళ్లు	మొత్తం రైతులు	221 మంది

సన్నరకం వడ్లు కావట..



ఈ ఏడాది సన్నం వడ్లకు ధర ఉంటుందని సన్నరకం వడ్లే సాగు చేసిన. ప్రభుత్వం బోనస్ లభిస్తుంది, బయట కూడా ధర ఉంటుందని అంకుర్ సోన రకం సన్నవడ్ల విత్తనాలు డీలర్ల వద్ద కొనుగోలు చేసి రెండున్నర ఎకరాల్లో సాగు చేసిన. హార్వేస్టింగ్ చేసి కొనుగోలు కేంద్రంలో ఆరబోసి వారం రోజులు అవుతుంది. మేడం వచ్చి మిషన్ల వడ్లు పోసి ఈ వడ్లు సన్నరకం బోనస్ చెల్లింపు సరితూగవని చెప్పింద్రు.. సన్నవడ్లని సాగు చేస్తే గిట్లయింది.

– ఆర్.మల్లేశ్‌గౌడ్, గుడిపేట్, హాజీపూర్

షరతులు లేకుండా కొనాలి..

వానాకాలం ముందట సన్న రకం వడ్లకే బోనస్ అని ప్రకటించడంతోనే సన్న రకం వడ్లే సాగే చేసినం. ఇప్పుడేమో అన్ని రకాలు సన్న వడ్లు కావని షరతులతో బోనస్ చెల్లించడానికి పని రాదని చెబుతున్నరు. ఇటు ప్రభుత్వం షరతులు ప్రైవేట్ వ్యాపారులకు మేలు చేసేలా ఉన్నాయి. బోనస్ ధర అన్ని సన్నరకాలు ఉంటే వ్యాపారులు కూడా ఎక్కువ ధర చెల్లిస్తరు. ఇప్పుడు రూ.2,300, రూ.2,400 మాత్రమే చెల్లిస్తున్నరు.

– బి.శ్రీనివాస్, కుందారం, జైపూర్

మంచిర్యాలను స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తాం

- రూ.29 కోట్లతో స్టేడియం నిర్మాణం
- కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలోని సాయికుంటలో 11.5 ఎకరాల స్థలంలో స్టేడియం నిర్మిస్తామని, ఇందుకు ప్రభుత్వం రూ.29 కోట్లు మంజూరు చేసిందని కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. మంచిర్యాలను స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తామని తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ శివసేనరెడ్డితో కలిసి ఆదివారం స్టేడియం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో స్పోర్ట్స్ అథారిటీ రాష్ట్ర చైర్మన్‌తో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా మంచిర్యాలలో 11.5 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఇందులో ఇండోర్ స్టేడియం, సింథటిక్ ట్రాక్, స్విమ్మింగ్ ఫూల్, మల్టీపర్పస్ స్టేడియం నిర్మిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది డిసెంబర్‌లో నిర్వహించే సీఎం కప్ క్రీడలకు సంబంధించిన రాష్ట్రస్థాయి క్రీడల్లో ఏదో ఒకటి మంచిర్యాలలో నిర్వహిస్తామని తెలిపారు. స్టేడియం నిర్మాణం పూర్తయితే జిల్లాకు చెందిన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతారన్నారు. విద్య, వైద్యంతోపాటు, క్రీడాకారులను తయారు చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ వేణు, స్పోర్ట్స్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

క్యాన్సర్ ఆసుపత్రికి స్థల పరిశీలన

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో క్యాన్సర్, ఆయుష్ ఆసుపత్రి నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆదివారం పరిశీలించారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో మంచిర్యాల జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, గర్మిళ్ల ప్రభుత్వ పాఠశాల, బెల్లంపల్లి బజార్‌ఏరియా జెడ్పీ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1,042 మంది విద్యార్థులకు 999 మంది హాజరయ్యారు. 43 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఈవో యాదయ్య పరిశీలించారు.

డుమ్మాలకు చెక్

- డీఎడ్ కళాశాలల్లో 'ఫేషియల్' అటెండెన్స్
- ఛాత్రోపాధ్యాయులు, లెక్చరర్ల హాజరుపై ఎస్‌సీఈఆర్టీ ఫోకస్
- త్వరలోనే ఎఫ్‌ఆర్‌ఎస్ అమలు



ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డైట్ కళాశాల

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ విద్యను గాడిలో పెట్టేందుకు ఎస్‌సీఈఆర్టీ దృష్టి సారించింది. డీఎడ్ విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఫేషియల్ రికగ్నిజేషన్ సిస్టమ్ (ఎఫ్‌ఆర్‌ఎస్)ను అమలులోకి తెచ్చింది. ప్రస్తుతం సర్కారు బడుల్లో విద్యార్థులకు ఈ విధానం అమలులో ఉంది. తాజాగా ప్రభుత్వ, ప్రైవేట్ డీఎడ్ కళాశాలల్లో అమలుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రైవేట్ కళాశాలల్లో అభ్యసించే కొంతమంది ఛాత్రోపాధ్యాయులు తరగతులకు ఎగనామం పెడుతున్నారు. అయితే చాలా కళాశాలల్లో తరగతులకు హాజరు కాకుండా యాజమాన్యాలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఇందుకోసం డబ్బులు ముట్టజెబుతున్నారు. ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఎస్‌సీఈఆర్టీ ఎఫ్‌ఆర్‌ఎస్‌ను అమలు లోకి తెచ్చింది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఏడు డీఎడ్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ డీఎడ్‌తో పాటు రెండు ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ డైట్‌లో 300 మంది విద్యను అభ్యసిస్తున్నారు. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మీడియంలో కోర్సులు కొనసాగుతున్నాయి. అలాగే వివేకానంద, విద్యార్థి ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. ఇక ఉట్నూర్‌లో పూలాజీబాబా, నిర్మల్‌లో పంచశీల్, భైంసాలో జీపీలడ్డా, ఆసిఫాబాద్‌లో శ్రీనిధి, మంచిర్యాలలో ఎస్ఆర్‌కేఎం డీఎడ్ కళాశాలలు కొనసాగుతున్నాయి. వీటిలో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో కలిపి వంద చొప్పున 600 మంది విద్యార్థులు చదువుతున్నారు.మొత్తంగా 900 మంది విద్యార్థులు డీఎడ్ కోర్సు చేస్తున్నారు.


తరగతులకు ఎగనామం..

ఈ కళాశాలల్లో ఆ జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ డైట్‌తో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని జిల్లాల్లో గల ఒకట్రెండు కళాశాలల్లో విద్యార్థులు ప్రతిరోజు వచ్చే విధంగా ఆ యాజామాన్యాలు కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. మిగతా కళాశాలల్లో తరగతులకు గైర్హాజరైతే వారి నుంచి డబ్బులు తీసుకుంటున్నట్లు సమాచారం. హాజరు వేసేందుకు రూ.20వేలు, రికార్డుల కోసం రూ.10వేలు, పరీక్షల సమయంలో మరో రూ.10వేల చొప్పున తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పాఠశాల మాదిరిగానే డీఎడ్ తరగతులు కొనసాగుతాయి. ప్రథమ సంవత్సరంలో 40 రోజులు, ద్వితీయ సంవత్సరంలో 60 రోజుల పాటు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు తరగతులు బోధించాల్సి ఉంటుంది. అలాగే బోధించిన విషయాలపై రికార్డులు రాయాలి. కానీ డబ్బులు ముట్టజెప్పిన వారికి కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నాయి. వార్షిక పరీక్షల సమయంలో సైతం డబ్బులు తీసుకొని పరీక్షలు రాయిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

లెక్చరర్లు లేకుండానే..

ఉమ్మడి జిల్లా పరిధిలో చాలా కళాశాలల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకుండానే కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రిన్సిపాల్‌తో పాటు ఎనిమిది మంది లెక్చరర్లను నియమించుకోవాలి. అయితే ఒకరిద్దరితో విద్యాబోధన చేయించి మమ అనిపిస్తున్నారనే విమర్శలున్నాయి. దీంతో విద్యార్థులు స్వతహాగా చదువుకొని పరీక్షలు రాస్తున్నారే తప్పా వారు పూర్తిస్థాయిలో జ్ఞానం పొందలేకపోతున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అయితే ఈ అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఛాత్రోపాధ్యాయులతో పాటు లెక్చరర్లకు ఫేషియల్ అటెండెన్స్ సిస్టమ్ అమలు చేయాలని నిర్ణయించారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ అమలుకు చర్యలు..



ఎస్‌సీఈఆర్టీ ఆదేశాల మేరకు ప్రభుత్వ డైట్‌తో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని డీఎడ్ కళాశాలల్లో త్వరలో ఫేషియల్ అటెండెన్స్ సిస్టమ్ అమలుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే విద్యార్థులు, లెక్చరర్లు, సిబ్బంది వివరాలను ఎస్‌సీఈఆర్టీకి పంపించాం. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలి. లేకుంటే పరీక్షలకు అనుమతించబడరు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. అలాగే ప్రైవేట్ కళాశాలలను తనిఖీ చేస్తున్నాం.

– రవీందర్‌రెడ్డి, ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్, ఆదిలాబాద్

ఆన్‌లైన్‌లో 'సమగ్ర' సమాచారం

- జిల్లాలో 98.8 శాతం సర్వే పూర్తి
- 16 మండలాల్లో డాటా ఎంట్రీ షురూ..
- మున్సిపాలిటీల్లోనూ ప్రారంభిస్తున్న వైనం
- డిసెంబర్ 1వ తేదీ వరకు గడువు



డాటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు

మంచిర్యాలటౌన్: ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియలో భాగంగా జిల్లాలో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ జిల్లాలో ప్రారంభమైంది. 16 మండలాల్లో 100 శాతం కుటుంబ సమగ్ర సర్వే పూర్తి కాగా, 7 మున్సిపాలిటీల్లో 1.2 శాతం ఇంకా మిగిలి ఉంది. జిల్లా వ్యాప్తంగా సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు 800 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు. ఒక్కొక్కరికి 300 కుటుంబాల సమాచారం అందించనున్నారు. ఒక రోజులో కనీసం 30 కుటుంబాలకు తగ్గకుండా సమాచారం పోర్టల్‌లో నమోదు చేయాలని డాటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు 500 మంది, పట్టణ ప్రాంతాలకు 300 మంది ఆపరేటర్లు పనిచేయనున్నారు. డిసెంబర్ 1వ తేదీలోపు ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. ప్రస్తుతం 16 మండలాల్లో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఈ నెల 22వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. 7 మున్సిపాలిటీల్లో వంద శాతం సర్వే పూర్తి కాకపోవడంతో, ఆన్‌లైన్ నమోదును శనివారం నుంచి నమోదు చేస్తున్నారు.

అనుకున్న తేదీలోపు కష్టమే

జిల్లాలో చేపట్టిన సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు జిల్లావ్యాప్తంగా 800 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించినా, వారు పూర్తిస్థాయిలో రాక పోవడం, శిక్షణ అందక పోవడం, ఆన్‌లైన్ నమోదులో సర్వర్ ఇబ్బంది పెట్టడం తదితర కారణాలతో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. దీంతో డిసెంబర్ 1వ తేదీలోపు ఆన్‌లైన్ పూర్తయ్యే అవకాశం లేదని తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో సర్వే పూర్తి కావడంతో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు దరఖాస్తు ఫారాలతో డాటా ఎంట్రీ చేయించే ప్రక్రియను వేగవంతం చేయగా, పట్టణ ప్రాంతాల్లో సర్వే కొంత మిగిలి ఉంది. 7 మున్సిపాలిటీల్లో మంచిర్యాల మున్సిపాలిటీలో శనివారం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ప్రారంభించినా, సర్వర్ సమస్యతో ముందుకు సాగలేదు. మున్సిపాలిటీల్లోని కుటుంబాల సంఖ్య ఎక్కువగా ఉండడం, డాటా ఎంట్రీ ఇప్పుడిప్పుడే మొదలు పెడుతుండడంతో డిసెంబర్ 1వ తేదీలోపు ఆన్‌లైన్ నమోదు చేయడం కష్టమే. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ఆలస్యం అయ్యే అవకాశం ఉండడంతో మరో రెండు మూడు రోజులు పెంచి, పూర్తిస్థాయిలో సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా చేపట్టేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

జిల్లాలో సర్వే వివరాలు

జిల్లాలోని మొత్తం ఇళ్లు	2,54,249
సర్వే జరిగిన ఇళ్లు	2,51,836
పూర్తయిన సర్వే శాతం	98.8 శాతం
డాటా ఎంట్రీ ఆపరేటర్లు	800

ఎన్‌సీసీతో ఉన్నత శిఖరాలకు

- ఆర్డీవో శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు



హాజరైన ఎన్‌సీసీ క్యాడెట్లు

మంచిర్యాలక్రైం: ఎన్‌సీసీ ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి నిచ్చెన లాంటిదని ఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవం నిర్వహించారు. ఆర్డీవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్‌సీసీ క్రమశిక్షణకు మారుపేరని, కృషి, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. తాను ఇదే కళాశాలలో చదివానని, ఎన్‌సీసీ క్యాడెట్‌గా ఉన్నానని గుర్తుచేసుకున్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు ఉన్నత ఉద్యోగావకాశాలలో ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం పెరుగుతాయని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి మాట్లాడుతూ మన కళాశాల విద్యార్థి 32 ఏళ్ల తర్వాత ఉన్నత అధికారి హోదాలో ఎన్‌సీసీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఎన్‌సీసీ క్యాడెట్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లేశ్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ జాడి మహేశ్‌కుమార్, లెఫ్టినెంట్ బి.తిరుపతి, కళాశాల అధ్యాపకులు కిష్టయ్య, కుమార్, గోపాలకృష్ణ, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి



మాట్లాడుతున్న పర్వత్‌రెడ్డి

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూటీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంచిర్యాలలోని ఓ హోటల్‌లో ఎస్టీయూటీఎస్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పీఆర్సీ నివేదిక పూర్తిచేసి వెంటనే ప్రకటించాలన్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని పేర్కొన్నారు. జీవో 317 బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని సూచించారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక..

ఎస్టీయూటీఎస్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా హైదరాబాద్ జిల్లా కార్యదర్శి రాంచంద్రారెడ్డి, పోలిరెడ్డి వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా బట్టరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా బాపు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా కరుణాకర్, అసోసియేట్ అధ్యక్షుడిగా సత్తయ్య, ఉపాధ్యక్షులుగా జయ, మస్నోహన్, మహాలక్ష్మి, అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎం.సుమన్, జిల్లా కార్యదర్శులుగా జయ, శ్రీరామ్, మాధవి, స్వప్నదేవి, ఆర్థిక కార్యదర్శిగా సత్యనారాయణ, ఫైనాన్స్ కమిటీ సభ్యులుగా గంగాధర్, సుజాత ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా పూర్వ అధ్యక్షుడు పోలాల వెంకటేశ్వర్లు, పూర్వ ప్రధాన కార్యదర్శి శంకర్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో బీట్ అధికారికి గాయాలు


గాయపడిన వెంకటేశ్

జన్నారం: విధి నిర్వహణలో సొంత బీట్‌కు వెళ్తున్న బీట్ అధికారి వెంకటేశ్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. అటవీ అధికారులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జన్నారం అటవీ డివిజన్ తాళ్లపేట్ రేంజ్‌లో పనిచేస్తున్న వెంకటేశ్ శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై జన్నారం నుంచి చింతగూడ వైపు వెళ్తుండగా చింతగూడ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలు కావడంతో విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే లక్సెట్టిపేట ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి

కడెం: మండలంలోని దత్తోజీపేట్ అటవీ ప్రాంతంలో అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అల్లంపల్లికి చెందిన కస్తూరి రమేశ్ (26) ఈనెల 23న కూలీ పని కోసమని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టగా గంగాపూర్ జీపీ పరిధిలోని దత్తోజీపేట్ అటవీ ప్రాంతంలో మృతదేహం కనిపించింది. మృతిపై విచారణ చేపట్టాలని మృతుని భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కల్వర్టు పైనుంచి పడి ఒకరు..


రమేశ్(ఫైల్)

కడెం: కల్వర్టుపై నిద్ర ఓ యువకుడిని కాటికి పంపింది. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాసాయిపేట్‌కు చెందిన తీగల రమేశ్(33) కొన్నేళ్లుగా లక్ష్మణచాంద మండలంలోని చామన్‌పల్లిలో ఉంటున్నాడు. తన మేనత్త మృతి చెందిందని ఇటీవలే మాసాయిపేట్‌కు వచ్చాడు. ఈనెల 23న రాత్రి అతిగా మద్యం సేవించి గ్రామ సమీపంలోని కల్వర్టుపై పడుకున్నాడు. అదుపుతప్పి కిందపడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య సుకన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రైయినేజీలో పడి ఒకరు..


సుభాష్ (ఫైల్)

ఇంద్రవెల్లి: ప్రమాదవశాత్తు డ్రైయినేజీలో పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై భీంరావ్ తెలిపిన వివరాల ప్రకారం దనోరా(బి) గ్రామానికి చెందిన కుంర సుభాష్ (48) ఆదివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకుంటుండగా ప్రమాదవశాత్తు డ్రైయినేజీలో పడి మృతి చెందాడు. ఏఎస్సై కాత్లే భీంరావ్ మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని బాలుడు..


రిషాన్ (ఫైల్)

దహెగాం: ఐదేళ్లకే ఆ బాలుడికి నూరేళ్లు నిండాయి. ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా ట్రాక్టర్ రూపంలో మృత్యువు కబలించింది. మండలంలోని దేవాజీగూడలో ఘటన చోటు చేసుకుంది. ఎస్సై కందూరి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. దేవాజీగూడకు చెందిన సదువుల క్రిష్ణ, వనిత దంపతుల కుమారుడు రిషాన్ (5) ఆదివారం ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన సదువుల శ్రీనివాస్ ట్రాక్టర్‌తో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి వరకు ఆడుకుంటున్న బాలున్ని ట్రాక్టర్ కబళించడంతో అయ్యో రిషాన్ అంటూ అక్కడున్నవారు కన్నీటి పర్యంతమయ్యారు. బాలుని బాబాయ్ సదువుల ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

'దిమ్మదుర్తి'లో బర్డ్ ఫెస్టివల్


వడ్రంగి పిట్ట
కొంగ
కొంగజాతి పక్షి


చెరువు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

- అటవీ ప్రాంతంలో నేచర్ క్యాంపు
- సందడి చేసిన పర్యాటకులు..


అటవీప్రాంతంలోకి సఫారీకి వెళ్తున్న పర్యాటకులు


పక్షుల వివరాలను పర్యాటకులకు వివరిస్తున్న సీసీఎఫ్ అధికారి శరవణన్

మామడ(నిర్మల్): నిర్మల్ జిల్లా మామడ మండలంలోని దిమ్మదుర్తి అటవీ అటవీరేంజ్ పరిధిలో ఉన్న నల్దుర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని తుర్కం చెరువు, పొన్కల్ గ్రామ పంచాయతీ పరిధిలోని యెంగన్న చెరువుల వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేచర్ క్యాంపు, బర్డ్ ఫెస్టివల్ కార్యక్రమాలు హైటీకోస్ బృందం పర్యాటకులను ఆకట్టుకున్నాయి. హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులో వచ్చిన పర్యాటకులు శనివారం చెరువుల వద్దకు చేరుకోగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పర్యాటకులు కవ్వాల్ అభయారణ్యం, చెరువులను సందర్శించారు. రాత్రి సమయంలో క్యాంపుఫైర్ ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం తుర్కం చెరువు నుంచి యెంగన్న చెరువుకు ప్రత్యేక వాహనాలలో సఫారీ నిర్వహించారు. చెరువులకు వచ్చిన పక్షుల అందాలను కెమెరాలలో బందించారు. అటవీశాఖ అధికారులు పీసీసీఎఫ్ వైల్డ్‌లైఫ్ ఏలుసింగ్ మేరు, సీసీఎఫ్ అధికారి శరవణన్, డీఎఫ్‌వో నాగినిభాను, ఎఫ్‌డీవో భవానిశంకర్, ఎఫ్ఆర్‌వోలు శ్రీనివాస్‌రావు, అవినాష్, రామకృష్ణ, అనిత వారికి చెరువుల ప్రాముఖ్యత, ఈ ప్రాంతంలోకి వలస వచ్చే పక్షుల గురించి వివరించారు.

సంతోషం కలిగించింది



అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల నేచర్ క్యాంపు కార్యక్రమం నాకు చాలా సంతోషం కలిగించింది. ఇక్కడ అటవీ ప్రాంతంలో ఉన్న చెరువుల పరిసరాలు, వైవిధ్యమైన పక్షులు ఆహ్లాదం పంచాయి.

– ఉషా, పర్యాటకురాలు, హైదరాబాద్

పరిసరాలు ఆకట్టుకున్నాయి



నేచర్‌క్యాంపు, బర్డ్ వాక్ కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వరంగల్ నుండి వచ్చా. ఇక్కడి చెరువుల పరిసరాలు ఆకట్టుకున్నాయి. పక్షులు నివసించేందుకు అనువైన వాతావరణం ఉంది. పర్యాటకంగా మరింత అభివృద్ధి చేస్తే బాగుంటుంది.– రమేశ్, వైల్డ్‌లైఫ్ ఎన్‌జీవో సొసైటీ, వరంగల్

అవగాహన కల్పించారు



రెండు రోజుల నేచర్ క్యాంపు కార్యక్రమం చాలా ఆనందం కలిగించింది. చెరువు పరిసరాలు, పక్షులు, చెట్లరకాలపై అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఇక్కడి ప్రాంతం ప్రాముఖ్యతను ఇతరులకు కూడా తెలియజేస్తాం. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుంది.

– గుర్రం కిషోర్, పర్యాటకుడు, వరంగల్

పక్షులు పర్యావరణ మిత్రులు


మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో శివకుమార్

చెన్నూర్: పక్షులు పర్యావరణ మిత్రులని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శివకుమార్ అన్నారు. రెండు రోజులుగా మంచిర్యాల రేంజ్ పరిధిలోని శివ్వారం వైల్డ్‌లైఫ్ సాంక్చురీ, గొల్లవాగు ప్రాజెక్ట్, చెన్నూర్ రేంజ్ పరిధిలోని అర్బన్ ఎకో పార్క్‌లో డబ్ల్యూడబ్ల్యూఎఫ్ బృందం సభ్యులతో కలిసి పక్షులు, కీటకాలు, జీవరాసులపై సర్వే చేశారు. స్థానిక ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో ఆదివారం డబ్ల్యూడబ్ల్యూఎఫ్ బృందం ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. గోదావరి పరీవాహక ప్రాంతమైన మంచిర్యాల, చెన్నూర్, కోటపల్లి, నీల్వాయి రేంజ్ ఆఫీసర్లు, సిబ్బందితో కలిసి పక్షులు, కీటకాలు, జీవరాసులపై అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడించారు. రెండు రోజుల సర్వేలో 150 రకాల పక్షులు, 30 రకాల సీతాకోక చిలుకలను గుర్తించామన్నారు. శీతాకాలంలో నది పరీవాహక ప్రాంతాలకు వివిధ రకాల పక్షులు, బట్టర్‌ఫ్లైలు వలస వస్తుంటాయని, వీటిని సంరక్షించుకోవాలన్నారు. అటవీ ప్రాంతాల్లో పులులు, అడవి జంతువులే కాకుండా ఎన్నో రకాల బర్డ్స్, బట్టర్‌ఫ్లైలు ఉంటాయన్నారు. అనంతరం డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ప్రతినిధి రాజశేఖర్ మాట్లాడుతూ ఉత్తర భారత దేశంలో పక్షులు గోదావరి తీర ప్రాంతాలలో 8 వేల కోట్ల విలువైన ఎరువులను విసర్జిస్తుందన్నారు. చెరువులు, కుంటలకు కొత్త రకం బాతులు, కొంగలు వలస వస్తుంటాయని, వాటి ద్వారా ఎన్నో లాభాలు ఉన్నాయని తెలిపారు. పక్షులు, కీటకాలు వలస వస్తే ఈ ప్రాంతాల్లో వాటి సంతతి పెరుగుతుందన్నారు. మానవళి బర్డ్స్, బట్టర్‌ఫ్లైలకు హాని తలపెట్టవద్దని సూచించారు. సమావేశంలో నీల్వాయి, కోటపల్లి, మంచిర్యాల రేంజ్ ఆఫీసర్లు అప్పలకొండ, సదానందం, రత్నాకర్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ రిసోర్స్ పర్సన్లు హర్ష, సోహన్, డీఎఫ్‌వో ప్రభాకర్ పాల్గొన్నారు.

యువకుడి చికిత్సకు చేయూత

సాక్షి ఎఫెక్ట్..


కిరణ్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న రమేశ్

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన అమంద కిరణ్ కొంతకాలంగా కడుపు ఉబ్బరం, లివర్ సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ విషయమై ఈ నెల 18న 'సాక్షి'లో 'దాతల సాయంకోసం ఎదురు చూపు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన దాతలు కరిపె రాజ్‌కుమార్, పాల మహేశ్, ఇరాక్ రాజు, గంగాధర్, వినోద్, సైబెవార్ ఆంజనేయులు, చంద్రవిలాస్, కాలేరి రమేశ్, సత్యనారాయణ రూ.15వేల వరకు ఫోన్‌పే ద్వారా సాయం అందించారు. ఆదివారం కాంగ్రెస్ నాయకుడు వేల్పుల రమేశ్ తన సొంత ఖర్చుతో వాహనాన్ని ఏర్పాటు చేసి ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించాడు. కాగా ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సకు సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యాధికారులు పేర్కొన్నారు. దాతలు స్పందించి ఆదుకుంటే తప్ప కిరణ్ బతికే అవకాశం లేదని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

కొరమీనుకు కేరాఫ్‌గా మంచిర్యాల

- ఎల్లంపల్లి పాజెక్టు వద్ద సంరక్షణ, పెంపకం కేంద్రం
- 30 ఎకరాల్లో రూ. 15 కోట్లతో ఏర్పాటు
- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు


ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద కొరమీను సంరక్షణ కేంద్రం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పీఎస్సార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాష్ట్ర చేప కొరమీను(కొర్రమట్ట, బొమ్మె)కు మంచిర్యాల జిల్లా కేరాఫ్‌గా మారుతుందని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని ఎల్లంపల్లి వద్ద కొరమీను సంరక్షణ, పెంపకం కేంద్రం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఈమేరకు ప్రతిపాదిత స్థలాన్ని రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి స్థల పరిశీలన చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ భారీ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. 30 ఎకరాల్లో రూ.15 కోట్లతో యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కొరమీను జాతిని కాపాడటంతోపాటు సంఖ్యను గణనీయంగా పెంచుతూ రాష్ట్ర అవసరాలను తీర్చి ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు ఎగుమతి చేసేలా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇక్కడ ఉత్పత్తయ్యే చేప పిల్లలను రాష్ట్ర వ్యాప్తంగా చేపల పంపిణీ పథకానికి ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు. చేపల పెంపకం కోసం ఫిష్‌పాండ్‌లు ఏర్పాటు చేసుకుని ఉపాధితోపాటు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. ఎల్లంపల్లి వద్ద 85 ఎకరాల స్థలాన్ని మత్స్య శాఖకు అప్పగించగా, అందులో 30 ఎకరారు కొరమీను పెంపకం, సంరక్షణ ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మిగతా 55 ఎకరాల్లో అక్వా కల్చర్‌ఫాం కూడా ఏర్పాటు చేసి అన్ని రకాల చేపల పెంపకం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ వై.సాంబశివరావు, హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, సర్వేయర్ ఆశిష్, ఆర్ఐ ప్రభు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట రవి, జిల్లా అధికార ప్రతినిధి చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని పోటీల్లో పాల్గొనేలా చూస్తాం

- ట్రిపుల్‌ఐటీ వీసీ గోవర్ధన్


ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో చదివే విద్యార్థులను దేశవ్యాప్తంగా నిర్వహించే అన్ని పోటీలకు పంపిస్తామని వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ పేర్కొన్నారు. ఆటోవన్– 24 పోటీల్లో రాణించిన విద్యార్థులను ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనేలా చూస్తామని, అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు.

రెండోస్థానంలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

హైదరాబాద్ బిట్స్‌పిలానిలో ఈనెల 22, 23 తేదీల్లో ఆటోవన్ 24 పోటీలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు రెండోస్థానంలో నిలిచారు. మెకానికల్, మెటలార్జికల్ ఇంజినీరింగ్ చదివే విద్యార్థులు పాల్గొని 'మెటీరియల్స్ టెక్నాలజీ ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్స్' అనే పోస్టర్ ప్రదర్శించారు. విద్యార్థుల కృషిని గుర్తించిన అక్కడి న్యాయనిర్ణేతలు రెండోస్థానం కేటాయించారు. రూ.8వేల నగదు బహుమతి ఇచ్చి ప్రోత్సహించారు.

'ఆటవెలదిలో అమెరికా' పుస్తక పరిచయం


పుస్తక పరిచయం చేస్తున్న వామన్‌రావు

మంచిర్యాలఅర్బన్: జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక కృష్ణవేణి పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సాహితీ సంరక్షణ సమితి అలరించింది. కరీంనగర్ జిల్లా బొమ్మకల్‌కు చెందిన సబ్బని లక్ష్మీనారాయణ రచించిన ఆటవెలదిలో అమెరికా అనే పుస్తకాన్ని సంస్థ అధ్యక్షుడు వామన్‌రావు పరిచయం చేశారు. 2018లో తన అమెరికా అనుభవాలను పద్య కావ్యం ఆటవెలదిలో అమెరికా శతకాన్ని తన ప్రయాణ అనుభవాలను అమెరికా విశేషాలను, తెలుగువారి అప్యాయత, అదరించిన తీరు వర్ణించారన్నారు. నగలు నట్రలేవు వారి హృదయమున అంటూ వారి మనసులను ఉదహరించారని తెలిపారు. వృత్తి ఆంగ్లోపన్యాసకుడిగా, ప్రవృత్తి సాహిత్య సేద్యం చేస్తూ లక్ష్మీనారాయణ కలం నుంచి 41 పుస్తకాలు ఆవిష్కరించారన్నా రు. సాహిత్య వేదికలను స్థాపించటం, ఏడు ఆడియో గీతాల క్యాసెట్ల ఆవిష్కరణ, ఎన్నో అవార్డులు దక్కించుకున్నారని కొనియాడారు. సంస్థ ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, మహిళా కార్యదర్శి అడ్డగూరి శ్రీలక్ష్మీ, సంతోష్ కవితాగానం చేశారు.

గుప్తనిధుల ముఠా అరెస్టు


పెంచికల్‌పేట్: పోలీసుల అదుపులో ముఠా సభ్యులు

పెంచికల్‌పేట్: మండలంలోని లోడ్‌పల్లి బీట్ పరిధిలో సిద్దేశ్వర గుట్టల్లో గుప్తనిధుల తవ్వకానికి వచ్చిన ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పెంచికల్‌పేట ఎఫ్ఆర్‌వో అనిల్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తనిఖీలు చేయగా రెండు కార్లలో వచ్చిన ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారు. బొంబాయిగూడకు చెందిన వసంతరావు, కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రవీణ్‌కుమార్, వెంకన్న, సురేందర్, వెంకన్న, అంజన్న, రమేశ్‌పై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రెండు కార్లను సీజ్ చేశారు. ఈ దాడుల్లో డీఆర్‌వో జమీల్ అహ్మద్, ఎఫ్ఎస్‌వో వేణుగోపాల్, ఎఫ్‌బీవో మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల తవ్వకాల కలకలం

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ మండలంలోని కన్నెపల్లిలో గుప్త నిధుల తవ్వకాలు ఘటన కలకలం రేపింది. కన్నెపల్లిలో పాడు బడిన ఇంటిలో ఆదివారం గుప్త నిధుల కోసం ఇంటి యజమానితో పాటు పలువురు తవ్వకాలు జరిపారు. సమాచారం అందుకున్న పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. వారి వద్ద నుంచి ఆరు సెల్‌ఫోన్లు, ఒక ఆటో, పూజా సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. కొద్దిరోజులుగా ఈ ఇంట్లో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

బాసరలో సామూహిక సత్యనారాయణ వ్రతం


సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న దంపతులు

బాసర: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం కార్తిక మాసాన్ని పురస్కరించుకుని సామూహిక శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. వ్యాసపురి కన్యకా పరమేశ్వరి చారిటబుల్ ట్రస్ట్, యాత్రిక్ నివాస్ ట్రస్ట్ చైర్మన్ మూడ నాగభూషణం గుప్తా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

ఎంపీ పూజలు


పూజల్లో పాల్గొన్న ఎంపీ వంశీకృష్ణ

దండేపల్లి(మంచిర్యాల): జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన దండేపల్లి మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామిని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శ్రీనివాస్, సిబ్బంది, అర్చకులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అధికారులు శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం, లడ్డూప్రసాదం అందజేశారు.

అ'పూర్వ' సమ్మేళనం


సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

తాండూర్: మండల కేంద్రంలోని సురభి గోదా క్షేత్ర గార్డెన్స్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం అట్టహాసంగా జరిగింది. తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 విద్యాసంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు 27 ఏళ్ల తర్వాత కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. నాడు విద్య నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో నాటి గురువులు ఎస్.రాంమ్మోహన్‌రావు, ఎం.రాంమ్మోహన్‌రావు, జగన్నాథరావు, సురేందర్, రవి, సుభాంగిణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గూడెంలో భక్తుల రద్దీ


సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో కార్తికమాసం ప్రారంభం నుంచి భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 584 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతా లు నోముకున్నారు. సన్నిధి ద్వారం సమీపంలో గల రావిచెట్టు వద్ద భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు. దీంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో సందడిగా కనిపించాయి.